నగరంలోని కొన్ని ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం వర్షం పెద్ద ఎత్తున కురిసింది. ఈ నేపథ్యంలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రహదారులు వర్షపు నీటితో నిండి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎక్కడ చూసినా వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరికొన్ని చోట్ల వర్షపు తాకిడికి జన జీవనం నిలిచిపోయింది. షేక్‌పేట పరిధిలోని ఓయూ కాలనీలోనిది ఇక్కడ కన్పిస్తున్న వర్షపు నీటి దృశ్యం. అయితే, వనస్థలిపురం – పనామా ఎక్స్ రోడ్ పరిధిలో ట్రాఫిక్ మొరాయించడంతో ఎక్కడికక్కడ నిల్చిపోయిన వాహనాలను చూడొచ్చు.

నగరంలో దుర్గంధం రాజ్యమేలుతున్నది. అసలే.., వర్షాకాలం, ఆపై ఎక్కడి చెత్త అక్కడే..! దీంతో పరిసరాలు చిత్తడి చిత్తడిగా మారి వాతావరణం అంతా దుర్గంధభరితం అవుతున్నది. దీంతో ఈగలు, దోమలకు చెత్త కుప్పలు అలవాలంగా మారి విశ్వ నగరాన్ని కాస్త రోగాల నగరంగా మార్చుతున్నాయి. ఎక్కడా పారిశుధ్య ఆనవాళ్లు కనిపించడం లేదు. ఇవి, పాలకులు, అధికార యంత్రాంగానికి పట్టవు. రోగాలు ప్రబలి పోయేది ప్రజల ప్రాణాలే.. అయితే, మాకేంటి? అనే ధోరణిలో పాలక, అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నది.

ఈ అక్రమం ఎవరి పాపం?

- ఎర్రకుంటలోని అక్రమ నిర్మాణాలపై అనుమానాల వెల్లువ...!
- హైడ్రాకు ఉన్న సమాచారం స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు లేదా?

ఎర్రకుంటలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన దృశ్యం

దుండిగల్, ఆగస్టు 16: అక్రమాలకు తావిచ్చిందెవరు? సాధారణ ప్రజల్లో ఆశలు రేకెత్తించి, సక్రమాలకు తిలోదకాలిచ్చి దుర్మార్గం వైపు నడిపించిందెవరు? ఈ పాపానికి ఒడిగట్టిందెవరు? కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు బాధ్యులు ఎవరు? అధికారులు నిజాయితీగా పనిచేస్తే అసలు అక్రమాలు జరుగుతాయా? అనే ప్రశ్నలు స్థానిక సామాన్య ప్రజలల్లోనూ ఉత్పన్నమవుతున్నాయి. ఒకటేమిటి అన్ని విభాగాలల్లోనూ అవినీతి రాజ్యమేలుతుందనడానికి నిన్న బాచుపల్లిలోని ఎర్రకుంటలో కూల్చిన నిర్మాణమే సాక్ష్యంగా నిలుస్తుందంటున్నారు స్థానికులు. ఒక సాధారణ వ్యక్తి సక్రమంగా ఇల్లు కడితేనే రాబందుల్లా వాలిపోయే అధికారులు, ఏకంగా ఎర్రకుంట చెరువులోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణం సాగిస్తుంటే ఎందుకు అడ్డుకోకుండా ఉంటారా? హైడ్రా అధికారులకు ఉన్న సమాచారం స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ మున్సిపాలిటీ అధికారులకు లేదా? అయినా చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్‌ట్యాంక్ లెవల్)లో నిర్మాణాలకు హెచ్ఎండీఏ అధికారులు ఎలా అనుమతి ఇస్తున్నారనే ప్రశ్నలు వెలువడుతున్నాయి. కేవలం తమకు అందాల్సిన వాటా అందితే చాలు ఎక్కడైనా అనుమతులు ఇస్తామనే రీతిలో అధికారులు ఉండటం చేతనే ఇటువంటి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుకుంటున్నారు. అసలు ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్/ బఫర్ జోన్‌ను పక్కకు తప్పించిన స్థానిక రెవెన్యూ యంత్రాంగం ఎన్‌వోసీ ఇవ్వడంతోనే అసలు కథమొదలైందని తెలుస్తుంది. చెరువు ఎఫ్‌టీఎల్/బఫర్‌ను పక్క సర్వే నంబర్లల్లో చూపించి నిర్మాణదారులు రెవెన్యూ స్కెచ్ పొందారని, దానికి ఇరిగేషన్ అధికారులు సైతం వంత పాడటంతోనే సుమారు వేయి గజాల స్థలంలో మూడు బ్లాకులు ఐదంతస్థుల చొప్పున వెలిసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. మొదటి నుంచి ఈ నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్నా అటు హెచ్ఎండీఏ గాని ఇక్కడి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గానీ గుడ్డిగా వ్యవహరించడం వెనుక పెద్ద మొత్తంలో ఆమ్యామ్యాలు చేతులు మారినట్లు సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. బఫర్ జోన్/ ఎఫ్‌టీఎల్ పరిధిలో జరుతున్న నిర్మాణాలను సంబంధిత అధికారులు ఆదిలోనే అడ్డుకుంటే ఇప్పుడీ నష్టం జరిగేది కాదు కదా..! అనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ పాపంలో రెవెన్యూ, ఇరిగేషన్, లోకల్ బాడీ, హెచ్ఎండీఏ సహకారం లేకుంటే నిర్మాణాలు ఇంతవరకు వచ్చేవా? అంటూ స్థానికులు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా అవినీతికి పాల్పడే అధికారులపై విచారణ జరుపాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తుంది.

మిగతా అక్రమ నిర్మాణాలపైనా చర్యలుంటాయా...?

కాగా బాచుపల్లి ఎర్రకుంట చెరువులో వెలసిన ఆక్రమ నిర్మాణాలను తాను పరిశీలించిన 12 గంటల లోపే కూల్చివేతలకు శ్రీకారం చుట్టిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అదే రోజు నిజాంపేట్‌లోని స్ప్రింగ్ వ్యాలీలో నిర్మిస్తున్న విల్లాలు, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని కుడికుంట చెరువు నాలాపై నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనాన్ని పరిశీలించిన నేపథ్యంలో వాటిపైనా ఇదే రకమైన చర్యలు ఉంటాయా...? లేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. మరో వైపు హైడ్రా పనితీరుతో అక్రమార్కుల వెన్నులో వణుకుమొదలైందని పలువురు పేర్కొంటున్నారు.

మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ

ఉప్పల్, ఆగస్టు 16: అప్స – టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు హబ్సిగూడ సెంటర్ సమన్వయకర్త పురుషోత్తం గోపి తెలిపారు. 20 నుంచి 28 ఏండ్ల వయస్సు కలిగిన బీ ఎస్సీ, బీకాం, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎమ్మెస్సీ, ఎంకామ్ విభాగాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు ఫోన్ 9154990132, 9154990130లలో సంప్రదించవచ్చన్నారు.

'దోమల నివారణ చర్యలు వేగవంతం చేయండి'

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : దోమల నివారణకు చేపట్టే యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యలపై కాలనీవారీగా షెడ్యూల్ తయారు చేయాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్, జోనల్ కమిషనర్లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దోమల నివారణ చర్యలపై షెడ్యూల్ తయారు చేసి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

వర్సిటీలలో 60 ఏండ్లు దాటినా

కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు కొనసాగవచ్చు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: రాష్ట్రంలోని యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు అరవై ఏండ్లు దాటినా కొనసాగవచ్చునని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ అన్ని యూనివర్సిటీల రిజిస్ట్రార్‌లకు పంపించారు. ఆయా వర్సిటీలలోని విభాగాలలో ఉన్న అవసరాన్ని బట్టి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సేవలను కొనసాగించుకోవచ్చని సూచించారు.

ప్రయాణికుడికి గుండెపోటు

సీపీఆర్ చేసిన ఆర్టీసీ సిబ్బంది

హయత్‌నగర్, ఆగస్టు 16 : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లకు గుండెపోటు రావడంతో ఆర్టీసీ సిబ్బంది సకాలంలో స్పందించి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. హయత్‌నగర్ డిపోకు చెందిన బస్సులో ఎల్బీనగర్ నుంచి విజయవాడ వెళ్లడానికి వెంకటేశ్వర్లు బస్సు ఎక్కాడు. కొద్దిసేపటికే ఆయనకు ఛాతి నొప్పి రావడంతో పాటు చెమటలు వచ్చి పడిపోయాడు. అప్రమత్తమైన కండక్టర్ యాదయ్య, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీ శివప్రసాద్‌లు కలిసి ప్రయాణికుడికి సీపీఆర్ చేయగా స్పృహలోకి వచ్చాడు. ప్రయాణికుడి బంధువులకు సమాచారమిచ్చి సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికుడి ప్రాణాలను కాపాడిన ఆర్టీసీ సిబ్బందిని హయత్‌నగర్ ఆర్టీసీ డిపో-1 మేనేజర్ జలగం విజయ్ అభినందించారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు వెంకటేశ్వర్లుకు సీపీఆర్ చేస్తున్న సిబ్బంది

సర్దార్ స్ఫూర్తిగా బహుజనులంతా ఏకం కావాలి

సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి యువతకు ఆదర్శదాయకం: మంత్రి పొన్నం

గొప్ప పాలనకు మారు పేరు సర్దార్ పాపన్న సాహసం: ఎంపీ ఈటల

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో పలువురు నేతలు

చిక్కడపల్లి, ఆగస్టు16: సర్దార్ సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకుని రాజ్యాధికారం కోసం బహుజనులంతా ఏకమై ముందుకు సాగాలని పలువురు ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు. తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో దళిత బహుజన విప్లవ వీరుడు, స్వయం పరిపాలకులు సర్దార్ సర్వాయి పాపన్న 374 జయంతి ఉత్సవ సభను శుక్రవారం చిక్కడపల్లిలో ఘనంగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ కె.స్వామి గౌడ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ హన్మంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మాజీ ఐఏఎస్ చీరంజీవులు పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని, స్ఫూర్తిదాయకమని అన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, మహనీయుల జయంతి, వర్ధంతిలను జరుపుకోవడం అంటే వారి ఆశయసాధనకు పాటుపడటమే అని అన్నారు. పాపన్న విగ్రహం చూడగానే కర్తవ్యం గుర్తుకు రావాలని, గొప్ప పాలన అందించిన సర్దార్ పాపన్న సాహసానికి మారు పేరు అని కొనియాడారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్ కుమార్ గౌడ్, వెంకటేశ్ గౌడ్, గణేశా చారి, అంబాల నారాయణ గౌడ్, ఎంవీ రమణ, గాయకులు రాములింగం, ఎపూరు సోమన్న పాల్గొన్నారు.

దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పీజీఆర్ఆర్‌సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు వివిధ కోర్సులకు ప్రతి ఏటా రెండు దఫాలుగా ప్రవేశాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మొదటి దఫా శుక్రవారం నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు ప్రవేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. వివిధ పీజీ, యూజీ, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులతో కలిపి మొత్తం 72 ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. కోర్సుల వివరాలు, నిబంధనలు, ఫీజు వివరాలు తమ వెబ్‌సైట్ www.oucde.netలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అందులో లాగిన్ అయి దరఖాస్తు ఫారం నింపాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు, కోర్సు ఫీజు, పరీక్షా ఫీజులను ఆన్‌లైన్ విధానంలోనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

డీజీపీగా పదోన్నతి పొందిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డిని నగర పోలీస్ కా ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులతో కలిసి నగర పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నల్ల శంకర్ రెడ్డి శుక్రవారం కలిసి సీపీకి శుభకాంక్షలు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సొసైటీ ట్రెజరర్ విక్టర్, ఉపాధ్యక్షుడు అసీఫ్‌ఖాన్, సభ్యుడు జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

– సిటీబ్యూరో, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ)

పేద బ్రాహ్మణులను ఆదుకోవాలి

నిత్యావసర సరుకుల కేవీఆర్ కిట్లను అందజేస్తున్న విశ్రాంత ఐఏఎస్ రమణాచారి

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 16. ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయాన్ని ఇతరులకు అందించి తమలోని దాతృత్వాన్ని చాటుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి రమణాచారి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం, శ్రావణ మాస వరలక్ష్మి వ్రతం సందర్భంగా బ్రాహ్మణ సేవ వాహిని మహిళా విభాగం ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని నఫీజ్‌రెసిడెన్సీలో గల రమణాచారి క్యాంపు కార్యాలయంలో పలువురు మహిళలకు నిత్యావసర సరుకులతో కూడిన డాక్టర్ కేవీఆర్‌సీ కిట్లను పంపిణీ చేశారు. పేదరికంలో ఉన్న బ్రాహ్మణులను ఆదుకునేలా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ప్రముఖ సంఘసేవకులు భరత్, సుధాకర్, రాధమ్మ, సునీత, గోపాల్ పాల్గొన్నారు.

లిథియం అయాన్ బ్యాటరీల రీ సైక్లింగ్ గొప్ప అవకాశం

ఫేవా చైర్మన్ డాక్టర్ శైలేంద్ర సరోజ్

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఫేవా చైర్మన్, డాక్టర్ శైలేంద్ర సరోజ్

మాదాపూర్, ఆగస్టు 16: భారతదేశంలో లిథియం అయాన్ బ్యాటరీలను రీ సైక్లింగ్ చేయడం చాలా గొప్ప అవకాశమని ఫేవా (ఇంటర్‌నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ అసోసియేషన్) చైర్మన్ డాక్టర్ శైలేంద్ర సరోజ్ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన హింటెక్స్, ఐపీఈసీ, ఈకో స్టైన్ ఎక్స్ పో 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫేవా (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ అసోసియేషన్) చైర్మన్, డాక్టర్ శైలేంద్ర సరోజ్ విచ్చేసి రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సొల్యూషన్ ప్రొవైడింగ్ కంపెనీ, మ్యాట్‌లాబ్స్ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకుడు వర్గీస్ సామ్యేల్, తెలంగాణ, ఏపీ చాప్టర్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ ఇంజనీర్స్ డీఎస్ షెట్టి, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ రోబోటిక్, ఆటోమేషన్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, మియాపూర్, చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఫేజ్ – 3 అధ్యక్షుడు రమేష్, టీఎస్, ఏపీ నేషనల్ సాలిడ్ వేస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమియా కుమార్ సాహు, తెలంగాణ చిన్న పరిశ్రమల సంఘాల సమాఖ్య భాస్కర్‌రెడ్డి, జీడిమెట్ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డిలతో పాటు హైటెక్స్ బిజినెస్ హెడ్ టీజీ శ్రీకాంత్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2023లో భారతదేశ బ్యాటరీ రీసైక్లింగ్ మార్కెట్ విలువ 1.97 యూఎస్‌డీ బిలియన్‌గా ఉందన్నారు. 2030 వరకు దాదాపు 9.8 శాతం సమ్మేళన వార్షిక రేటు వృద్ధి చెందనున్నట్లు అంచనా వేశారు. డాక్టర్ వర్గీస్ సామ్యేల్ మాట్లాడుతూ, లిథియం అయాన్ బ్యాటరీల కొరకు ప్రపంచ డిమాండ్ శిలాజ ఇంధన రహిత ఆర్థిక వ్యవస్థలో లిథియం అయాన్ బ్యాటరీలది కీలకమైన భూమిక అని అన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 450 ప్రదర్శకులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సేవల్లో కోత

- ప్రయాణికుల తప్పని ఇబ్బందులు
- బోరబండ బస్ టెర్మినల్‌లో బస్సుల కోసం పడిగాపులు

శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో బోరబండ బస్ టెర్మినల్ వద్ద బస్సుల రాకకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు.

ఎర్రగడ్డ, ఆగస్టు 16: నగరంలోని ప్రధాన బస్ టెర్మినల్స్‌లో బోరబండ ఒకటి. నగరంలోని వివిధ డిపోలకు చెందిన బస్సులు వందల సంఖ్యలో ట్రిప్పులు ఇక్కడికి వచ్చిపోతుంటాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో బోరబండ టెర్మినల్‌కు రోజుకు మొత్తం 850 వరకు బస్సుల ట్రిప్పులు కొనసాగేవి. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు బస్ టెర్మినల్‌లో ఎప్పుడు చూసినా కనీసం ఐదు నుంచి 10 బస్సులు కన్పించేవి. దీంతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఐతే.., కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బోరబండ బస్ టెర్మినల్ వద్ద ప్రయాణికులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రస్తుతం, 100 నుంచి 150 ట్రిప్పుల వరకు తగ్గించారు. అంతే కాకుండా, టెర్మినల్ ప్రాంగణంలో ప్రయాణికులకు అందుబాటులో ఉండే బస్సుల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఇక్కడి నుంచి రోజుకు సుమారు 12000 మంది ప్రయాణికులు బస్సులలో రాకపోకలు సాగిస్తుంటారు. ట్రిప్పుల సంఖ్య తగ్గటం.., సమయానికి టెర్మినల్‌లో బస్సులు అందుబాటులో లేకపోవటం వల్ల ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కరోనా సమయంలో రద్దు చేసిన 45ఎఫ్ రూటు బస్సులను పునఃప్రారంభిచాలని వారు కోరుతున్నారు. బస్సుల ట్రిప్పుల సంఖ్యను కూడా పెంచాలని స్థానిక కంట్రోలర్‌ను పలువురు ప్రయాణికులు కలిసి కోరటం జరిగింది.

బిల్లులు చెల్లిస్తేనే వైద్యం అందిస్తారట

రూ.2.50 లక్షలు చెల్లించినప్పటికీ అందని వైద్యం

సన్ రైస్ దవాఖాన తీరుపై బాధితుల ఆందోళన

సన్ రైస్‌దవాఖాన యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 16: బిల్లులు చెల్లిస్తేనే వైద్యం అందిస్తామని సన్ రైస్ దవాఖాన యాజమాన్యం ఆదేశించడంతో బాధితులు దవాఖాన ఎదుట ఆందోళనకు దిగిన ఘటన శుక్రవారం శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం, ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ఆరుగురికి గాయాలైన విషయం తెలిసిందే. అయితే, గాయాలైన వారిని శంషాబాద్ పట్టణంలోని సన్‌రైస్ ప్రైవేటు దవాఖానలో చికిత్స నిమిత్తం చేర్చారు. దీంతో దవాఖాన యాజమాన్యం ఆరుగురికి వైద్యం అందిచడం కోసం డబ్బులు చెల్లించాలని కోరగా, రూ.2.50 లక్షల చెల్లించినా దవాఖాన యాజమాన్యం ఇంకా డబ్బులు చెల్లించాలని లేకపోతే వైద్యం అందించమని ఆదేశించారు. దీంతో ఇప్పటికే ఇబ్బందులకు గురవుతున్న బాధితులు ఆందోళనకు దిగారు. తమను డిశ్చార్జి చేయాలని ప్రైవేటు దవాఖానలో బిల్లులు చెల్లించలేమని తెలిపారు. దీంతో బిల్లులు చెల్లించి ఎక్కడికైనా వెళ్లి వైద్యం చేయించుకోవాలని ఆదేశించిన తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్పేస్ టెక్నాలజీలో ఆవిష్కరణలకు ప్రోత్సాహం

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): స్పేస్ టెక్నాలజీలో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు టీహబ్ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ నిపుణులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నామని టీహబ్ ప్రతినిధి తెలిపారు. స్పేస్ రంగంలో ఉన్న అవకాశాలపై ఔత్సాహికులైన స్టార్టప్ వ్యవస్థాపకులకు అవగాహన కల్పించేందుకు ఈనెల 20న టీ హబ్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. వివరాలకు, పేర్లు నమోదు చేసుకునేందుకు లింక (https://tevents.t-hub.co/SustainabilityinSpace)లో సంప్రదించాలని తెలిపారు.

మెరుగైన వైద్యం అందించండి

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): లైంగికదాడికి గురై నిలోఫర్‌లో చికిత్స పొందుతున్న గిరిజన బాలికకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్, రాంబాబునాయక్ వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం దవాఖానను సందర్శించిన వారు బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.రవికుమార్‌ను కోరారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 16 : మండల కేంద్రానికి చెందిన కొల ప్రతాప్‌రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అందజేసిన రూ.5వేలను మాజీ సర్పంచ్ జెన్నాయికోడె నగేశ్ అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, నాయకులు మల్లేశ్, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేటలో బీఆర్ఎస్ నాయకురాలు సుదగాని అండమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె కుటుంబానికి కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో అందజేసిన రూ.5వేలను స్థానిక నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సుదగాని లింగయ్య, యువజన విభాగం మండల నాయకులు పరశురాములు, మల్లయ్య, అంజయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 16 : పట్టణంలోని రాయగిరిలో శుక్రవారం ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి నుంచి రాయగిరి వైపు వెళ్తున్న ఆటోకు రాయగిరి సమీపంలో ఒక్కసారిగా ముందు టైరు ఊడిపోయింది. దీంతో ఆటో బోల్తా పడగా.. అందులో ప్రయాణిస్తున్న లాలుప్రసాద్‌యాదవ్, వెంకటేశ్, డ్రైవర్ శ్రీనివాస్‌తోపాటు మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భువనగిరిలో అక్రమ నిర్మాణాల తొలగింపు

భువనగిరి అర్బన్, ఆగస్టు 16 : పట్టణంలోని రైతు బజార్ సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షట్టర్‌ను శుక్రవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినా, షాపులు నిర్వహించేందుకు షట్టర్స్, డబ్బాలు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

కాంగ్రెస్ మహిళా జిల్లా కార్యదర్శిగా లక్ష్మీబాయి

భువనగిరి అర్బన్, ఆగస్టు 16 : కాంగ్రెస్ మహిళా జిల్లా కార్యదర్శిగా భువనగిరి పట్టణంలోని బంజారాహిల్స్ కాలనీకి చెందిన బానోత్ లక్ష్మీబాయి నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శుక్రవారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.